సాక్షి సంగారెడ్డి

బుధవారం । 6 । నవంబర్ । 2024



చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ భారత చిరుధాన్యాల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభమైంది. వివరాలు 8లో ▸



తేమశాతంపై తకరారు

ధాన్యం కొనుగోలులో తేమశాతంపై కొడిపల్లి మండలం ధర్మాసాగర్, సదాశివపల్లి రైతులు నిలదీశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాలు 8లో ▸

నేడు చెస్ క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గజ్వేల్ పట్టణంలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సౌందర్యలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 17 విభాగంలో చెస్ క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

13న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: ప్రత్యేక ప్యాకేజీతో నారాయణఖేడ్ నుంచి అరుణాచలానికి ఈనెల 13వ తేదీన ప్రత్యేక బస్సు నడుపుతున్నామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. బస్సు 13 సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి బయలుదేరి 14న కాణిపాకం చేరుకుంటుందన్నారు. అక్కడ విఘ్నేశ్వరస్వామి దర్శనం అనంతరం అదేరోజు వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అదేరోజు రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 15న ఉదయం భక్తులు అరుణాచలం గిరి ప్రదక్షణ చేయవచ్చన్నారు. అదేరోజు సాయంత్రం బస్సు అక్కడి నుంచి బయలుదేరి 16న జోగులాంబ అమ్మవారిని దర్శించుకొని, అదేరోజు సాయంత్రం ఖేడ్‌కు చేరుకుంటుదని వివరించారు. రానుపోను చార్జీ ఒక్కొక్కరికి రూ. 4,500 ఉంటుందన్నారు. వివరాలకు 9959223170, 9704885694 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో మాట్లాడుతున్న నిర్మల

సంగారెడ్డి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని పది జిల్లాల క్రీడాకారులు పోటీలో పాల్గొంటున్నారు. ఒక్కో జిల్లా నుంచి 20 మంది క్రీడాకారులు హాజరుకాగా 4 రోజులపాటు పోటీలు జరగనున్నాయి. పోటీలకు వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్, సెక్రటరీ జావిద్ అలీ, అనంత కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిన్నారం (పటాన్‌చెరు): రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలను అందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీపీఓ గోవింద్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డీపీఓ గోవింద్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తేమ శాతం పరిశీలించి మాట్లాడారు. తేమ పేరుతో రైతులకు ఇబ్బందులకు గురి చేయవద్దని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ స్వప్న, నిర్వాహకులు భిక్షపతి, రైతులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైన వారిని గుర్తించాలి

రామాయంపేట(మెదక్)/నిజాంపేట(మెదక్): మత్తుకు బానిసైన వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇప్పించాలని మెదక్ డీఎంహెచ్‌ఓ శ్రీరాం సూచించారు. మంగళవారం మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రగ్స్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మత్తుకు అలవాటుపడిన వారి ప్రవర్తనలో మార్పు కన్పిస్తుందన్నారు. త్వరలో సబ్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తామని, నిజాంపేట మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి గాను ఇంజనీరింగ్ అధికారులు త్వరలో టెండర్ పిలుస్తారని పేర్కొన్నారు. అనంతరం నిజాంపేట మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించే ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు.

గింజ కొంటే ఒట్టు..

తేమ పేరుతో సేకరణలో తీవ్ర జాప్యం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. హత్నూర మండలం దేవులపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న పరిస్థితి. ఈ కేంద్రాన్ని ప్రారంభించి పక్షం రోజులు దాటుతున్నప్పటికీ ఇంకా తూకాలు ప్రారంభం చలేదు. దీంతో ఈ కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన సుమారు 60 మంది రైతులు ఎప్పుడెప్పుడు కాంటాలు షురూ చేస్తారా..? అని ఎదురు చూస్తున్నారు.

- కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులు దాటుతున్నా..
- చాలా కేంద్రాల్లో షురూ కానీ కాంటాలు
- అన్నదాతను వెంటాడుతున్న అకాల వర్షాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ధాన్యం సేకరణ పట్టాలెక్కడం లేదు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కాంటాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల పక్షం రోజుల క్రితం ఎంతో ఆర్భాటంగా కేంద్రాలను ప్రారంభించారు. కానీ వివిధ కారణాలతో తూకాలు వేయడం లేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈవానాకాలం కొనుగోలు సీజన్‌లో జిల్లాలో సుమారు 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసింది. 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు కనీసం 30 కేంద్రాల్లో కూడా కాంటాలు ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు కేవలం 250 మెట్రిక్ టన్నుల లోపే ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

తేమ పేరుతో జాప్యం..

ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో ధాన్యాన్ని తూకం వేయడం లేదు. నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ శాతం 17లోపు ఉండాలి. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవడంతో తేమ శాతం ఎక్కువ చూపుతోంది. దీంతో గత నాలుగు రోజులుగా ధాన్యాన్ని ఆరబెట్టిన రైతుల ధాన్యాన్ని కూడా తూకం వేయడం లేదు. మాయిశ్చర్ మీటర్‌తో చూస్తే తేమ 19 నుంచి 21 శాతం వరకు వస్తోందని కేంద్రం నిర్వాహకులు సాకులు చెబుతున్నారు.



ధాన్యం కుప్ప వద్ద పడిగాపులు కాస్తున్న ఈ రైతు పుట్టి భూమయ్య. సిరిపురం గ్రామానికి చెందిన ఈయన తనకున్న నాలుగు ఎకరాల్లో పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చి సుమారు 20 రోజులు దాటింది. కానీ కాంటాలు కాలేదు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి ఇప్పటికే ఒకసారి ధాన్యం తడిసిపోయింది. దీంతో ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు పడరాని పాట్లు పడిన భూమయ్య ఎప్పుడెప్పుడు కాంటాలు అవుతాయా.. అని ఎదురుచూస్తున్నారు.

వెంటనే తూకం వేయాలి



కొనుగోలు కేంద్రాల్లో వెంటనే తూకం వేయడం ప్రారంభించాలి. తూకంలో జాప్యం చేస్తుండటంతో కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. అకాల వర్షాలు ఆందోళనలకు గురి చేస్తున్నాయి. వర్షం పడితే ధాన్యాన్ని కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాలంటే మరో వారం రోజులు పడుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే తూకం వేయాలి.

– దశరథ్‌రెడ్డి, ధాన్యం రైతు, కోడూరు, పుల్కల్ మండలం

కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిల్లుల అలాట్‌మెంట్ కూడా పూర్తయింది. దీంతో తూకాలు ప్రారంభమయ్యాయి. ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సర్వేకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటింటి కుటుంబ సర్వే
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ



సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. సర్వేకు సంబంధించి జిల్లాలో అన్నిరకాల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అన్నివర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల తదితర వివరాలు సేకరించనున్నారు. సర్వే నిర్వహణకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి అవగాహన కల్పించారు.

మూడు రోజుల పాటు స్టిక్కర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేసేందుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. కులగణనలో భాగంగా అధికారులు మూడు రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించనున్నారు. ఇంటి యజమాని పేరు, వార్డు నంబరు.. తదితర వివరాలతో ఇంటి గోడలపై స్టిక్కర్లను అతికించారు. ఈనెల 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే కొనసాగనుంది.

ప్రశ్నావళి రూపంలో..

ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణలో భాగంగా ప్రశ్నావళి రూపంలో సర్వే ఉంటుందని అధికారులు వెల్లడించారు. కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, మతం, సామాజిక వర్గం, కులం, ఆధార్ కార్డు నంబర్‌తో పాటు వ్యక్తిగత వివరాలు నమోదు చేయనున్నారు. అదేవిధంగా బ్యాంకు రుణాలు, అప్పులు, స్థిర, చర ఆస్తుల వివరాలు, పశు సంపద తదితర వివరాలు సేకరిస్తారు. అందుకు పూర్తి వివరాలు, వాటి సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచుకుంటే సర్వే గణన త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంటుంది. సర్వే సందర్భంగా ఎలాంటి ఫొటోలు, పత్రాలు తీసుకోవడం జరగదని అధికారులు వెల్లడించారు. కుల గణన సర్వేలో భాగంగా ఎలాంటి అవకతవకలు లేకుండా పక్కాగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సర్వే కోసం ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే నియమించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. సర్వే చేసే విధానం, సేకరించాల్సిన అంశాలు, సేకరించిన వివరాలు ఎవరికి అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా 3,364 ఎన్యూమరేటర్లు, 337 సూపర్‌వైజర్లను నియమించారు. అందులో భాగంగా పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు తదితర సిబ్బందిని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లగా నియమించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల వార్డులు 637, మున్సిపాలిటీల్లో 199 వార్డులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 3,419 ఈబీలుగా విభజించి, 4,07,873 ఇళ్లను గుర్తించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

చేగుంటలో రగ్బీ పోటీలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ కళాశాల ఆవరణలో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ రగ్బీ పోటీలను నిర్వహించారు. వివిధ మండలాల నుంచి 350 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. అండర్ 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహించారు. 36 మంది బాలురను, 36 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ కరణం గణేష్‌రవికుమార్ తెలిపారు. వీరంతా ఈనెల 10 నుంచి మేడ్చల్ జిల్లా కేఎల్‌ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీలను మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేష్, పీఈటీల సంఘం జిల్లా అధక్షుడు నాగరాజు, సెలక్షన్ కమిటీ ఇంచార్జ్ శారద, రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం మల్లీశ్వరీ, సిద్దిపేట ఇంచార్జీ భరత్‌రెడ్డితో పాటు పలు మండలాలకు చెందిన రగ్బీ రెఫరీలు పాల్గొన్నారు.

టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబర్‌గా రవిశంకర్



నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబర్‌గా సంగారెడ్డి పట్టణ బీజేపీ అధ్యక్షుడు రవిశంకర్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు మంగళవారం ఆయనకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రవిశంకర్ బీజేపీ బలోపేతం కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారని కొనియాడారు.

రైతులు ఇబ్బంది పడొద్దు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- డాకూరు, నాదులాపూర్‌లో కొనుగోలు కేంద్రాల పరిశీలన



నాదులాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

వట్‌పల్లి(అందోల్): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అందోల్ మండల పరిధిలోని డాకూరు, నాదులాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. నాదులాపూర్‌లో కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. నిబంధనలకు లోబడి తేమ శాతం వచ్చేలా ధాన్యం ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్‌మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాదులాపూర్, డాకూరు శివారులో వరి కోతను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం నాదులాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ అదనపు కలెక్టర్ మనోజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి జ్యోతి, అదనపు డీఆర్డీఓ పీడీ జంగారెడ్డి, ఆర్‌డీఓ పాండు, ఏడీఏ ప్రవీణ, ఏఓ శ్రీహరి, ఏఈఓ శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ



రామాయంపేటలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న పద్మ

రామాయంపేట(మెదక్)/చిన్నశంకరంపేట/మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గురించి ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ ఆరోపించారు. మంగళవారం రామాయంపేటలోని దళితవాడలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇప్పటివరకు రైస్ మిల్లులు అలాట్ చేయకపోవడం సరికాదన్నారు. సకాలంలో తూకం వేయకపోవడంతో రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ చంద్రం, కౌన్సిలర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం పరిశీలించారు. కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు మైలారం బాబు, పట్లోరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సుజాత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం బేషరతుగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వడ్ల తేమ శాతాన్ని 17 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

సైబర్ ల్యాబ్ సేవలు అభినందనీయం

ఎస్పీ చెన్నూరి రూపేష్



అవార్డు అందజేస్తున్న డీజీపీ జితేందర్

సంగారెడ్డిజోన్: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందిస్తున్న సైబర్ ల్యాబ్ సేవలు అభినందనీయమని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. పోలీస్ సైబర్ ల్యాబ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రకటించిన అవార్డుల్లో మల్టీజోన్ -2లో జిల్లాకు రెండో స్థానం వచ్చింది. ఈమేరకు మంగళవారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా సైబర్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్ నగేష్ అవార్డు అందుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో 1,600కు పైగా మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించి అండగా నిలిచిందన్నారు. సైబర్ ల్యాబ్ టెక్నికల్ సపోర్ట్ పర్సన్ రాజలింగం, ఆపరేటర్లను ఎస్పీ అభినందించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెండింగ్ బిల్లులు చెల్లించండి: తపస్

సంగారెడ్డిఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి దత్తాత్రి, అడివప్ప ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులు 10 నెలలకుపైగా ఎదురుచూస్తున్నారని వాపోయారు. జీపీఎఫ్, మెడికల్, సరెండర్, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్, జీతాలకు సంబంధించిన సప్లమెంటరీ.. తదితర బిల్లులు పేరుకుపోయాయని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపుల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు నివేదన చేసినప్పటికీ కనీస స్పందన లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్, రాష్ట్ర బాధ్యులు నర్సింహారెడ్డి, బస్వరాజ్, మామిడి సుధాకర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు గోపాల్, మల్లికార్జున్, చంద్రశేఖర్, తుకారాం, తుక్కప్ప, నర్సింలు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'ంతల ప్రణాళిక

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మారేపల్లి పాఠశాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పదో తరగతిలో శతశాతమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం విద్యార్థులకు ఈనెల 2వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. ఇదే కాకుండా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించింది.

జిల్లాలో 281 పాఠశాలలు

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు కలిపి 281 ఉన్నాయి. వీటిలో సుమారు 14 వేల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి రోజు సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 వరకు (గంట పాటు) ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో సబ్జెక్టు బోధించేలా నెల రోజుల పాటు నిర్వహించే తరగతుల ప్రణాళిక తయారుచేశారు. ప్రతి రోజు ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు హోం వర్క్ ఇస్తూనే, నోట్‌లను సరిదిద్దుతున్నారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. 71 శాతం నుంచి 100 శాతం మార్కులు ఉన్న విద్యార్థులు ఏ గ్రూపులో, 36 నుంచి 70 శాతం మార్కులుంటే బీ, 35 శాతం కంటే తక్కువ మార్కులు ఉన్న విద్యార్థులకు సీ గ్రూపు కేటాయించనున్నారు. వీటిలో ప్రధానంగా బీ, సీ గ్రూపులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బాలికలు, బాలురుకు వేర్వేరుగా ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి, ఆ గ్రూపులో ప్రతి విద్యార్థి పనితీరును పర్యవేక్షించడమే కాకుండా, వెనుకబడిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు తరుచుగా మాట్లాడి బోధన మెరుగయ్యేలా చొరవచూపనున్నారు. ఇదే కాకుండా పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లను సందర్శించి, విద్యార్థి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని పాఠశాలకు వచ్చేలా తగుచర్యలు తీసుకోనున్నారు.

వందశాతం ఫలితాలే లక్ష్యం



పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈనెల 2వ తేదీ నుంచి సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిని ఉత్తీర్ణత చేయడమే ప్రత్యేక తరగతుల లక్ష్యం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జిల్లాలో వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ

క్లుప్తంగా

కల్లు సీసాలో జెల్ల పురుగులు

పలువురికి అస్వస్థత


కల్లు సీసాలో జెల్లపురుగులు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలోని ఒక కల్లు దుకాణంలో కల్లుతాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఇసుక అక్రమ రవాణా విషయమై మంగళవారం గ్రామంలో జరిగిన పంచాయతీ అనంతరం కొందరు కల్లు తాగడానికి దుకాణానికి వెళ్లారు. కల్లు తాగుతున్న క్రమంలో నర్సింహులు తాగిన సీసాలో జెల్ల పురుగులు వచ్చాయి. దీనితో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు .. దుకాణం వద్దకు వెళ్లి నిలదీశారు. వీరిలో కొందరికి వాంతులయ్యాయని గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం నర్సింహులును రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కరెంటు షాక్‌తో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం

తొగుట(దుబ్బాక): ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కాన్గల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దోమల కొమురయ్య ఎద్దు వ్యవసాయ పొలం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రసమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృత్యువాత పడింది. ఎద్దు మృతితో తనకు సుమారు రూ. 70 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు కన్నీటి పర్యంతం అయ్యాడు. అధికారులు స్పందించిన తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఊరకుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం శివారులో గొర్రెల మందపై ఊర కుక్కలు దాడిచేయడంలో 12 గొర్రెలు మృతి చెందాయి. సోమవారం రాత్రి చిన్నశంకరంపేటలోని గొడుగుమర్రి వద్ద గొర్రెలను షెడ్డులోకి పంపగా.. కుక్కలు దాడిచేసి హతమర్చాయి. కురమ్మపల్లికి చెందిన పుల్ల స్వామి గొర్రెల మందను షెడ్డులో పెట్టి తినేందుకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరిగా కుక్కలు దాడిచేశాయని తెలిపారు. సుమారు రూ.60 వేల నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫోన్ హ్యాక్ చేసి నగదు డ్రాకు యత్నం

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫోన్‌హ్యాక్ చేసి నగదు డ్రా చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫోన్‌కు అపరిచిత వ్యక్తులు అక్టోబర్ 31 తేదీన హ్యాక్ చేశారు. అనంతరం ఆ ఉద్యోగి ఫోన్ నుంచి రూ. 45 వేల నగదును డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు వెంటనే తన ఫోన్ చెక్ చేయగా.. ఓ గేమింగ్ యాప్ పిల్లలు ఇన్‌స్టాల్ చేసినట్లు గుర్తించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితురాలి రూ.45 వేల నగదును హోల్డ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినిపై హత్యాయత్నం

నిందితుడి అరెస్టు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థినిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం విద్యార్థిని దివ్యకృపపై ప్రేమ పేరుతో కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తృటిలో ఆమె ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడింది. నిందితుడు ధనసిరి చైతన్యను మెదక్ బస్టాండ్‌లో పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు వేధించినట్లు గుర్తిస్తే వెంటనే షీ టీంకు గాని, 100 కాల్ గాని స్థానిక సీఐ నెంబర్ గాని ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

- డీడీఎస్ మహిళల పట్టుదలతో అంతర్జాతీయంగా గుర్తింపు: మీరా
- జహీరాబాద్‌లో చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య జాతీయ సదస్సు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ భారత చిరుధాన్యాల సమాఖ్య ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని కేవీకే ప్రాంగణంలో రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, చిరుధాన్యాల చెల్లెండ్లు, ఎన్‌జీవోస్ ప్రతినిధులు వంద మంది వరకు పాల్గొన్నారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో, దాన్నే ఇంకా ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. చిరుధాన్యాల చెల్లెండ్లు ఎదర్కొంటున్న సాగు, మార్కెటింగ్, పశువులు, పక్షులు తదితర సమస్యల పరిష్కార అంశాలపై చర్చించనున్నారు. చిరు ధాన్యాలను పీడీఎస్‌లో చేర్చాలని సదస్సులో తీర్మానం చేయనున్నారు. ఈ సదస్సును ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. సదస్సులో ఐసీఆర్ అటారి జోన్ టిన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, నాబార్డ్ జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు. డీడీఎస్ బోర్డు సభ్యులు రాం ఆంజనేయులు, రుక్మణయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



40 ఏళ్ల నుంచి చిరుధాన్యాల సాగు

పస్తాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న డీడీఎస్ 40 సంవత్సరాల నుంచి చిరుధాన్యాల సాగుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. సంస్థ డైరెక్టర్ దివంగత సతీష్ మహిళా రైతులను ప్రోత్సహించి వారితో మిలెట్స్ పంటల పండించారన్నారు. పేద రైతుల గుర్తింపు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటం చేశారని కొనియాడారు. మహిళా రైతులు ఆర్థింగా బలపడేందుకు ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని కోరారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి తివారీ మాట్లాడుతూ తక్కువ నీరు, ఎరువులతో చిరుధాన్యాలు పండుతాయన్నారు. చిరుధాన్యాల చెల్లెండ్లు చేస్తున్న కృషికి తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. అంతకు ముందు డీడీఎస్ వ్యవస్థాపకులు దివంగత సతీస్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య సభ్యులను ఘనంగా సన్మాంచారు.

మహిళల కృషితో అంతర్జాతీయ గుర్తింపు

డీడీఎస్ మహిళల పట్టుదలతోనే చిరుధాన్యాలకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చింది. చిరుధాన్యాల ఆవశ్యకతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. మహిళల కృషి వల్ల 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకొనే అవకాశం దక్కింది. ఆహారంలో పోషకాలు పెంచడానికి కోట్లు ఖర్చు చేస్తున్నారు, కానీ పోషకాలు పుష్కలంగా ఉన్న చిరుధాన్యాలను పక్కన పెట్టడం దురదృష్టకరం. చిరుధాన్యాలు దండగ కాదు పండగని డీడీఎస్ మహిళలు కష్టపడ్డారు. -మీరా, ఐసీఆర్ అటారి డైరెక్టర్


చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం


సదస్సుకు హాజరైన పలు రాష్ట్రాల స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కొనుగోలు వేగవంతం చేయాలి

జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్వప్న

హత్నూర(సంగారెడ్డి): రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న అన్నారు. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యం తేమ శాతం చూసి వెంటనే తూకం వేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, సుతిల్ తాడులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా పాల్థిన్ టాపర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీపీఎం కొమరయ్య, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఏపీఎం దేవేందర్ మండలంలోని దౌలాపూర్, నాగుల్దేవులపల్లి, హత్నూర, గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

గంజాయి కేసుల్లో ముగ్గరికి జైలు

సంగారెడ్డి టౌన్/జిన్నారం (పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న, సాగు చేసిన పలు కేసుల్లో నిందితులకు కోర్టులు మంగళవారం శిక్షలు విధించాయి. 2022 సంవత్సరం బొల్లారం పరిధిలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో అప్పటి సీఐ సురేందర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారించారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచారు. మొదటి అదనపు డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి జయంతి కేసు పూర్వాపరాలను పరిశీలించి నిందితులిద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష, 25వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులిద్దరూ ఒడిశా రాష్ట్రానికి చెందినవారు.

మరో కేసులో ఒకరికి..

మునిపల్లి మండలంలో గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. మునిపల్లి మండలం తక్కడ్ పల్లికి చెందిన గొసోద్దీన్ పంట పొలంలో గంజాయి సాగు చేస్తుండగా 2019 ఏప్రిల్ 2న అధికారులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 25 వేల జరిమాన విధిస్తూ కోర్టు విధించింది.

పాన్‌షాపు యజమానుల బైండోవర్

(సంగారెడ్డి): నిషేధించిన గుట్కాలు, పాన్ మసాలాలను విక్రయిస్తున్న పాన్ షాపుల యజమానులను ఎస్పీ ఎదుట బైండోవర్ చేశారు. మంగళవారం రూరల్ ఎస్ఐ విశ్వజన్ ఆధ్వర్యంలో కందిలోని ఐఐటీ సమీపంలో గల దాబాల వద్ద పాన్‌షాపుల్లో పోలీసులు దాడులు నిర్వహించి గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. భవిష్యత్తులో గుట్కా, పాన్ మసాలాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు.

కారు ఢీకొని యువతి మృతి


శివాని (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు ఢీకొని యువతి మృతి చెందిన సంఘటన బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో నివాసముండే శివాని(21) పాలప్యాకెట్ కోసం ఇంటి సమీపంలోని కిరాణా దుకాణం వద్దకు స్కూటీపై వెళ్లింది. స్కూటీని నిలిపి దుకాణం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఓ కారు వేగంగా వచ్చి శివానిని ఢీకొట్టి.. కొంతదూరం ఈడ్చుకొని వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కారు నడిపిన వ్యక్తి మైనర్ అని పోలీసులు తెలిపారు.

శేఖాపూర్ తండాలో కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్ సందర్భంగా తండా ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

- 10మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటో సీజ్
- డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ తండాలో మంగళవారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. 10మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పోలీసులు, జిల్లా స్పెషల్ పోలీసులు మొత్తం 120 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తండాలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సరిహద్దు స్మగ్లర్లతో కాంటాక్టులో ఉన్న 10 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అదే విధంగా సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశామన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన అపరిచితులపై నిఘా ఉంచాలని, గంజాయి, గుట్కా, గుడుంబా విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా గంజాయి సాగు చేసినా అట్టి వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అట్టి వ్యవసాయ భూమిని జప్తుచేసి ప్రభుత్వానికి అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సంక్షేమ పథకాలు కూడా అందవని హెచ్చరించారు. నేర ప్రవృత్తి కలిగిన ఎవరైనా జిల్లా పోలీసుల సమక్షంలో లొంగిపోవాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు 8712656777 నంబర్ లేదా 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐలు శివలింగం, హనుమంతు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు, ఏఐలు, ఆర్ఐలు కాశీనాథ్, రాజశేఖర్, రామావావు, డానియల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


అశోక్ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన రైతు కొంతం అశోక్(48) వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై జగదేవ్‌పూర్ వచ్చారు. అనంతరం పెట్రోల్ పోసుకుందామని వెళుతుండగా ప్రజ్ఞాపూర్ నుంచి జగదేవ్‌పూర్ వైపు వస్తున్న టాటా ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అశోక్.. అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు ఆదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నా రు. అశోక్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించేవారు. అశోక్ మృతి చెందడం పట్ల డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

- నారాయణ క్యాంపస్ ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థుల ఆందోళన
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు


నారాయణ కళాశాల క్యాంపస్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

జిన్నారం (పటాన్‌చెరు): మండల పరిధిలోని కాజీపల్లి శివారులలోని నారాయణ కళాశాల క్యాంపస్ ఎదుట మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణ కళాశాలలో సోమవారం సాయంత్రం ఇంటర్ విద్యార్థిని వైష్ణవి బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న విద్యార్థులు, విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి క్యాంపస్ గేటు ఎదుట బైఠాయించారు. కూతురిని కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలిచివేశాయి. వీరికి మద్దతుగా పలు విద్యార్థి సంఘాల నాయకులు తరలివచ్చి మద్దతు ప్రకటించారు. బీఆర్‌ఎస్వీ, ఎస్ఎఫ్ఐ నవతెలంగాణ విద్యార్థి శక్తి సంఘాల నాయకులు సభ్యులు క్యాంపస్ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలిపారు. యాజమాన్యం తీరుపై మండిపడుతూ ప్రభుత్వం గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంగణం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బొల్లారం, జిన్నారం సీఐలు గంగాధర్, సుధీర్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాగా విద్యార్థిని వైష్ణవి మృతదేహానికి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసు, కుత్బుల్లాపూర్ శాఖ అధ్యక్షుడు అఖిల్, ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కుమార్, నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, సభ్యులు అఖిల్, జితేందర్ సాయి, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలి

డీఐఈఓ రవీందర్ రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డి, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 26 వరకు గడువును నిర్దేశించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం ఆర్ట్స్ అండ్ సైన్స్ ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ విద్యార్థులు రూ. 520, ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు రూ.750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.100 ఫైన్‌తో డిసెంబర్ 4 వరకు, రూ 500ల ఫైన్‌తో డిసెంబర్ 11 వరకు, రూ.1000 ఫైన్‌తో డిసెంబర్ 18 వరకు, రూ.2000 ల ఫైన్‌తో డిసెంబర్ 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులంతా సకాలంలో ఫీజు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి మార్కులతో ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

జక్కపల్లిలో భూవివాదం

ఇరువర్గాల ఘర్షణ

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం జక్కపల్లిలో మంగళవారం భూ వివాదంలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. జక్కపల్లిలోని సర్వే నంబర్ 86/2 లో ప్రభుత్వ, పట్టా భూమి కలుపుకొని ఉంది. గ్రామానికి చెందిన ఓ కుటుంబం 1971లో కొంత భూమిని సాదా బైనమాతో గిరిజనులకు విక్రయించారు. భూమిని కొనుగోలు చేసిన గిరిజనులు పట్టా చేసుకోవడంతో అట్టి భూమి అప్పట్లో విక్రయించిన వారి పేరును రికార్డుల్లో వస్తుంది. రికార్డుల్లో తమ పేరు మీద భూమి ఉండడంతో అదే సర్వే నంబర్‌లో ఉన్న పక్క భూమిని ఇతరులకు విక్రయించి హద్దులు పాతారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమి అని తేల్చారు. దీంతో కొనుగోలు చేసిన గిరిజనులకు, విక్రయించిన వారికి మధ్య వివాదం నెలకొని ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. సంఘటన స్థలానికి ఎస్సై లింగం సిబ్బందితో తరలి వెళ్లి ఇరు వర్గాలను చెదరగొట్టారు. త్వరలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఆర్డీఓ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

దుబ్బాక శివారులో ఆటో బోల్తా

10 మంది విద్యార్థులకు గాయాలు


అదుపు తప్పి బోల్తా కొట్టిన ఆటో

దుబ్బాకటౌన్: ఆటో బోల్తా పడిన ఘటనలో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన దుబ్బాక శివారులోని చీకోడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో జరిగింది. దుబ్బాక మండలం కమ్మర్‌పల్లికి చెందిన యాదగిరి తన ఆటోలో గ్రామం నుంచి విద్యార్థులను దుబ్బాకలో ఉన్న వివేకానంద విద్యాలయానికి రోజూ తీసుకెళ్తుంటాడు. మంగళవారం ఆటోలో పది మందిని తీసుకుని కమ్మర్‌పల్లి నుంచి పాఠశాలకు వస్తుండగా దుబ్బాక శివారులో ఆటో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. దీంతో పది మంది గాయపడ్డారు. బాబు, రోహిత్ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని దుబ్బాకలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఎవరికి కూడా ప్రాణనష్టం కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగం, అజ్రాగత్తగా ఆటో నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న విద్యార్థులను మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ పరామర్శించారు.

కాపాడిన చెట్టు కొమ్మ

ఆటో బోల్తా కొట్టే సమయంలో చెట్టు కొమ్మ ఆటోకు ఆధారంగా నిలిచింది. ఒకవేళ ఆ కొమ్మే లేకుంటే ఆటో పల్టీ కొట్టి పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

కార్తీక మాసం.. శుభప్రదం

- కేతకీలో మొదలైన కార్తీక మాససందడి
- దీపారాధన చేస్తున్న భక్తులు
- శివాలయాలకు భక్తుల తాకిడి
- పౌర్ణమి రోజు ప్రత్యేక కార్యక్రమాలు


ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయం

ఝరాసంగం(జహీరాబాద్): తెలుగు మాసాల్లో కార్తీకమాసం అత్యంత శుభప్రదంగా పరిగణిస్తుంటారు. ఈ పవిత్ర పుణ్యమాసం 2 నుంచి ప్రారంభమైంది. కార్తీక మాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో కిటకిటలాడుతున్నాయి. దీపారాధనతోపాటు తులసి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తుంటారు. భక్తులు తెల్లవారుజామున చన్నీటి నీటితో నది స్నానాలు, గుండంలలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. దీపారాధనతో పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి వదులుతారు. అంతేకాకుండా ఉపవాసంతో శివుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తూ శివ ధ్యానంలో పరవశించిపోతారు.

కేతకీలో మొదలైన సందడి

శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో కార్తీకమాస సందడి ప్రారంభమైంది. రోజురోజుకీ భక్తుల తాకిడి పెరుగుతుంది. అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, పౌర్ణమి నాడు గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఇప్పటికే ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



కార్తీక మాసం సందర్భంగా కేతకీ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు ఏర్పాట్లు చేశాం. పౌర్ణమిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గంగాహారతి తదితర అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తాం.

– శశిధర్, ఆలయ ఈఓ, కేతకి సంగమేశ్వర ఆలయం, ఝరాసంగం